ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 30 జూన్ 2024 | 5

రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

మూడు రోజులపాటు పిఠాపురం, కాకినాడలలో పర్యటన

- 7లో





ఓడలరేవు తీరంలో సముద్ర రాకాసి అలలకు కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రోడ్డు దృశ్యాలు

సముద్ర అలలకు కొట్టుకుపోయిన ఓఎన్జీసీ రోడ్డు

చమురు సంస్థల నిర్లక్ష్య ఫలితం

అల్లవరం, జూన్ 29: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో రాకాసి అలలు ఎగసిపడి తీరాన్ని కబళిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటుకు ముంపు పొంచి ఉంది. ఓఎన్జీసీ ప్రహరీని తాకుతున్న అలల తాకిడికి రక్షణగా ఉన్న ఓఎన్జీసీ రోడ్డు తాజాగా కొట్టుకుపోయింది. ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం తీర ప్రాంతంలో సముద్ర అలల ఉధృతి పెరిగి భారీగా తీర భూమి సముద్ర గర్భంలో కలిసిపోయింది. గడచిన 30 ఏళ్లలో లక్షలాది కోట్ల రూపాయల మేర చమురు ఉత్పత్తుల ద్వారా ఆదాయం పొందిన ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు తీర ప్రాంత రక్షణకు తీసుకున్న చర్యలు లేవని ఆరోపిస్తున్నారు. ఓఎన్జీసీ ప్లాంటుకు సైతం ముప్పు పొంచి ఉన్నా భూమి కోత బారిన పడినా తీరం వెంబడి రివిట్‌మెంట్, జియో ట్యూబుల ద్వారా రక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన తీరప్రాంత రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్‌లో శనివారం సీఎస్ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఇక పింఛన్ల సందడి

- రేపు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 11 కేటగిరీల పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు
- దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంపు
- ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ ప్రారంభం
- పంపిణీకి 4,247 మంది సిబ్బంది నియామకం
- జిల్లావ్యాప్తంగా రూ.160.89 కోట్లు పంపిణీకి సిద్ధం

అమలాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీ నుంచి పెంచిన పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 11 కేటగిరీల్లో పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపుదల చేశారు. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేలకు, పూర్తి వైకల్యం కలిగిన దివ్యాంగులకు రూ.5 వేల నుంచి రూ.15వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పింఛన్లను పెంచి పంపిణీ చేస్తారు. ఆదేవిధంగా 11 కేటగిరీల్లోని వారికి ఏప్రిల్ నుంచి వెయ్యి చొప్పున గత మూడు నెలలకు కూడా కలిపి మొత్తం రూ.7 వేలను అందిస్తారు. ఇక జిల్లాకు సంబంధించి మొత్తం పింఛను లబ్ధిదారులు 2,43,529 మంది ఉండగా, రూ.160.89 కోట్లను వారికి పంపిణీ చేయనున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హిమాన్షుశుక్లా పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పెంచిన పింఛన్లను జిల్లాలోని 515 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 3,897 మంది సచివాలయ సిబ్బందితోపాటు 350 మంది ఇతర శాఖల సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందించేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. ఒక్కో సచివాలయ సిబ్బంది 50 గృహాలకు పింఛన్లు అందిస్తారు. వీటి పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 46 బ్యాంకుల్లో పింఛన్ల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం జమచేయడం జరిగిందని, ఆ సొమ్మును పంపిణీ చేసే అధికారులకు బ్యాంకర్లు అందజేయాలన్నారు. అవసరమైతే ఆదివారం కూడా పింఛను సొమ్ములను అందించేవిధంగా బ్యాంకులు పనిచేయాల్సి ఉందన్నారు. తొలి రోజు నూరుశాతం పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అనివార్య కారణాల వల్ల ఎవరైనా పింఛన్లు తీసుకోని పక్షంలో వారికి రెండో తేదీన అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓదూరు సచివాలయంలో పింఛన్ల సొమ్ము లెక్కిస్తున్న ఉద్యోగులు

బ్యాంకుల నుంచి డ్రా.. పంపిణీకి రెడీ

ద్రాక్షారామ, జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. సామాజిక పింఛన్లను కూటమి ప్రభుత్వం పెంపుదల చేయడం, పెంపుదల ఏప్రిల్ నెల నుంచి వర్తింపజేస్తూ మొత్తం పింఛన్ల సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు. రామచంద్రపురం మండలంలో 10628 పింఛనుదారులకు రూ.6 కోట్ల 90 లక్షల 29 వేలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంపీడీవో తెలిపారు. పింఛన్ల సొమ్ము శనివారం సచివాలయాల సిబ్బందికి చేరింది. సోమవారం ఉదయమే పింఛన్లు పంపిణీ చేస్తారు.



ఉద్యోగ విరమణ చేసిన అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ

ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు సన్మానం

అమలాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఐవీకే నరసింహరావు, రిజర్వు సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన జె.రామస్వామి ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై నరసింహారావు, రామస్వామిలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బండారులంకలో మూతబడి ఉన్న రైతు భరోసా కేంద్రం

రైతు సేవా కేంద్రాలుగా ఆర్బీకేలు

జిల్లాలో వ్యవసాయ సలహా మండలి కమిటీలు రద్దు

అమలాపురం రూరల్, జూన్ 29: జిల్లాలో వ్యవసాయ సలహా మండలి కమిటీలను రద్దుచేసి వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, మండల, ఆర్బీకేల స్థాయిలోనే వ్యవసాయ సలహా మండలి కమిటీలన్నీ రద్దు అయ్యాయి. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు శనివారం డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను తక్షణం అమలు చేయాలని సూచించారు. గత వైసీపీ పాలనలో జిల్లా వ్యాప్తంగా 247 రైతు భరోసా కేంద్రాలను నిర్మించేందుకు అనుమతులు పొందారు. వాటిలో 167 భవనాలు పూర్తికాగా వాటిని ప్రారంభించారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వ్యవసాయ సలహామండలి కమిటీల రద్దుతోపాటు అనేక కీలక నిర్ణయాలను తీసుకున్నారు. దీనిలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పేరును ఇక రైతు సేవా కేంద్రంగా మార్పుచేయనున్నారు. ఆర్బీకేల వద్ద నవరత్నాలు, ఆర్బీకే లోగోతోపాటు అప్పటి సీఎం జగన్ ముఖ చిత్రంతో ఉన్న బోర్డులను తక్షణం తొలగించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. వ్యవసాయ రైతుల కోసం వైసీపీ ప్రభుత్వం గన్నవరం కేంద్రంగా ఏర్పాటుచేసిన ఆర్బీకే చానల్, స్టూడియోల పేర్లను పాడి పంటలు చానల్‌గా కూటమి ప్రభుత్వం మార్పుచేసింది. ఇక వైఎస్సార్ రైతు భరోసా మంత్లీ మ్యాగజైన్లను పాడిపంటల మ్యాగజైన్లుగా విడుదల చేయనున్నారు. ఈమేరకు అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు జేడీ బోసుబాబు తెలిపారు.



పి.గన్నవరం అక్విడెక్టు లంకలగన్నవరం వైపు ర్యాంపులో సిద్ధంచేసిన పడవ

ఇసుక ర్యాంపు నిర్వహణకు ప్రయత్నాలు

మాఫియా ప్రయత్నాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

పి.గన్నవరం, జూన్ 29: ప్రభుత్వ విధివిధానాలతో పనిలేకుండా నిబంధనలకు విరుద్ధంగా పట్టపగలు గన్నవరం అక్విడెక్టు చెంతనే లంకలగన్నవరంలో బోట్స్‌మన్ ఇసుక ర్యాంపును నిర్వహించేందుకు మాఫియా చేసిన ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. స్థానికుల సమాచారంతో తహశీల్దార్ ఆదేశాలతో ఇన్‌చార్జి ఆర్ఐ పి.నరసింహరావు, వీఆర్వో కోరుకొండ శ్రీనివాసరావు ర్యాంపు వద్దకు చేరుకుని ఇసుక తవ్వకాలకు ఏవిధమైన అనుమతులు లేవని, ఇసుక లోడు కోసం వచ్చిన ఖాళీ ట్రాక్టర్లను అక్కడ నుంచి బయటకు పంపించారు. ఇసుక తవ్వకాల నిమిత్తం ఏర్పాటుచేసిన పడవలను సైతం అక్కడ నుంచి బయటకు పంపించాలని హెచ్చరించారు. ఇదే విషయంపై తహశీల్దార్ ఎస్‌కె హసాన్సేన్‌ను వివరణ కోరగా మండల పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇసుక, మట్టి ర్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన అనుమతులు లేవని స్పష్టంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ప్రస్తుతం ర్యాంపులో ఖాళీ ట్రాక్టర్లు మాత్రమే ఉన్నాయని, వాటిని సిబ్బంది బయటకు పంపించారని ఆయన వివరించారు. కాగా ప్రభుత్వ విధివిధానాలు, అనుమతులు లేకుండా ఇసుక మాఫియా ఇసుక ర్యాంపును నిర్వహించేందుకు లోపాయికారీగా ప్రారంభోత్సవం చేశారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

అయిదేళ్ల నిరీక్షణ!

- టీడీపీ హయాంలో 90 శాతం పూర్తయిన ఏఎంసీ మార్కెట్ గొడౌన్
- పునాది దశ దాటిన షాపింగ్ కాంప్లెక్స్
- వైసీపీ పాలనలో నిర్మాణాలు శిథిలం
- శంకుస్థాపన శిలాఫలకం మాయం
- రైతుల అవసరాలను పట్టించుకోని వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్న రైతులు



నిర్మాణం పూర్తికాని వ్యవసాయ మార్కెట్ కమిటీ గొడౌన్



తుప్పలతో మూసుకుపోయిన షాపింగ్ కాంప్లెక్స్

ఉప్పలగుప్తం, జూన్29: అయిదేళ్ల వైసీపీ పాలనలో 'అభివృద్ధి' అనే మాటే లేదు. కొత్త ప్రభుత్వ భవనాల నిర్మాణం జరిగింది లేదు. చివరకు రైతులకు ఉపయోగపడే నిర్మాణాలపైనా శీతకన్నే. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా నిర్మాణం పూర్తయిన వాటినీ పట్టించుకోని దుస్థితి. దాంతో నిర్మాణం ప్రారంభించిన వారే తిరిగి అధికారంలోకి వచ్చేవరకు నిర్మాణం అక్కడే ఆగింది. తొంభై శాతం పూర్తయిన వ్యవసాయ మార్కెట్ కమిటీ గొడౌన్‌ను వైసీపీ పాలకులు శిథిలావస్థకు తెచ్చారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను అధోగతి పాల్జేశారు. అయిదేళ్లు రైతుల అభ్యర్థనను పట్టించుకోకుండా గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. తెలుగుదేశం హయాంలో ప్రారంభించిన నిర్మాణాన్ని తాము పూర్తి చేయడమేమిటన్న భావనతో అక్కడి శంకుస్థాపన శిలాఫలకాన్ని సైతం మాయంచేశారు. వెరసి గొడౌన్‌ను పందులకు నివాసంగా మార్చారు. గొడౌన్‌కు ముందుగా పునాదులు పడిన షాపింగ్ కాంప్లెక్స్‌కు అదే గతి పట్టించారు. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న అయితాబత్తుల ఆనందరావు ఈ నిర్మాణాల నిధుల సాధనకు విశేష కృషిచేశారు. మళ్లీ ఆయన అధికారంలోకి రావడంతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తవుతాయన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర లభించినప్పుడు విక్రయించుకునేందుకు వీలుగా ఉప్పలగుప్తంలో సిరిపల్లి-మునిపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా 2018లో రూ.1.50 కోట్ల అంచనాతో గొడౌన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రహదారిని ఆనుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అప్పటి ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వేగంగా నిర్మాణ పనులు సాగుతున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, గొడౌన్, కాంప్లెక్స్ నిర్మాణాలు పూర్తవుతాయని ఊహించుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ అయిదేళ్ల పాలనలో రైతు ప్రయోజనాలను పట్టించుకోకుండా నిర్మాణాలను గాలికొదిలేసింది. రూఫ్ దశకు చేరుకున్న గొడౌన్‌ను పట్టించుకోకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ఇక సమీపంలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ పునాదులు మట్టిలో కలిసిపోతున్నాయి. ఈ నిర్మాణాలపై సమీక్ష జరిపి నిర్మాణాల పూర్తికి ఎమ్మెల్యే కృషి చేస్తారని రైతులు ఆశిస్తున్నారు.

రైతులపై కక్ష కట్టిన వైసీపీ



వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు అయినకాడికి అమ్ముకోవలసి వస్తోంది. గొడౌన్ ఉంటే రైతులు తమ పంటను నిల్వ చేసుకోవచ్చు. అధిక ధరలు పలికినప్పుడు అమ్ముకోవచ్చు. ఈలోగా గొడౌన్‌లో ఉన్న పంటపై 80 శాతం వరకు రుణం పొందవచ్చు. దీనికోసం అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ఆనందరావుతో చర్చించి ఉప్పలగుప్తంలో స్థలం కేటాయించి గొడౌన్ నిర్మాణం ప్రారంభించాం. పనులు చురుగ్గా జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడ ఆగిపోయాయి. ఎమ్మెల్యేగా ఆనందరావు వీటిని పూర్తిచేసి రైతులకు ప్రయోజనం చేకూరుస్తారని ఎదురుచూస్తున్నాం.

- నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్

ధాన్యం నిల్వలకు చోటులేక రైతులకు ఇబ్బందులు



పంటను గట్టుకు తెచ్చిన క్షణం నుంచి రైతులకు ఒకటే ఆందోళన. వర్షం వస్తే ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలన్న గుబులు. అందుకే ఏదో ధరకు పంటను విక్రయించుకుని రైతులు నష్టపోతున్నారు. ఉప్పలగుప్తంలో గొడౌన్ ఉంటే అందరికీ ఎంతో ఉపయోగపడుతుంది. కావాలనే వైసీపీ పాలకులు గొడౌన్ నిర్మాణానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. తొందరలోనే గొడౌన్ పనులు ప్రారంభించేలా ఎమ్మెల్యే ఆనందరావు చర్యలు తీసుకుంటారని వేయికళ్లతో ఎదురుచూస్తున్నాం.

- పెమ్మిరెడ్డి సత్యనారాయణ, మండల తెలుగురైతు అధ్యక్షుడు

షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు తెచ్చిన ఘనత వైసీపీదే



కావాలనే గొడౌన్, షాపింగ్ కాంప్లెక్సులను వైసీపీ ప్రభుత్వం శిథిల స్థితికి చేర్చింది. రైతులంటే జగన్ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతను ఇప్పటికైనా ప్రజలు గుర్తించాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ నిర్మాణాలను ప్రారంభించారు. ఆయనే వాటిని పూర్తిచేసి రైతులకు అండగా ఉంటారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తవుతాయని ఎదురుచూస్తున్నాం.

- గాలిదేవర సురేష్‌కుమార్, టీడీపీ నాయకుడు



మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్, కమిషనరు తదితరులు

పట్టణ అభివృద్ధికి సమష్టి కృషి చేద్దాం

- అక్రమ పశువధ కబేళాపై ఉక్కుపాదం : మంత్రి సుభాష్
- మాజీ మంత్రి వేణుపై నేరుగా వైసీపీ కౌన్సిలర్ల విమర్శలు
- వాడివేడిగా రామచంద్రపురం పురపాలక సంఘ సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 29: రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా సమష్టి కృషి చేద్దామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా ఎక్స్ అఫీషియో సభ్యునిగా మంత్రి సుభాష్ సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ అవినీతి తావులేకుండా పాలన చేస్తామన్నారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆర్ఐ సూర్యారావు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను బ్రహ్మాజీ, శశిప్రీతమ్‌లను సమావేశ మందిరానికి పిలిచి మంత్రి హెచ్చరించారు. మాజీ మంత్రి వేణు, ఆయన కుమారుడు అన్నిచోట్లా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న అక్రమ పశువధ కబేళా సమస్యపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం సమస్య పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ ఇప్పటివరకు పార్టీ ప్రమేయంలేకుండా కౌన్సిల్ అంతా ఐక్యతగా ముందుకు సాగామన్నారు. పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తామన్నారు. కౌన్సిలరు వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ మీ తాత, తండ్రి, తల్లి కౌన్సిలర్లుగా పనిచేశారని, అటువంటి కుటుంబం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడం, చిన్న వయస్సులో మంత్రి పదవి చేపట్టడం కౌన్సిలరుగా ఆనందంగా ఉందన్నారు. పట్టణ అభివృద్ధికి వైసీపీ కౌన్సిలర్లు సహకరిస్తామన్నారు. కోఆప్షన్ సభ్యురాలు అమృతవల్లి మాట్లాడుతూ క్రైస్తవ శ్మశానవాటికను ఆక్రమించారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జనసేన కౌన్సిలరు అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ పాతబస్టాండు వద్ద శ్మశానవాటిక దుస్థితి వివరిస్తూ అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ మంత్రి వేణు లారీస్టాండు వద్ద శ్మశాన వాటికను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరించి ఆక్రమణకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ కౌన్సిలరు బొక్కా సత్యనారాయణ మాట్లాడుతూ వార్డుల్లో ఇన్నాళ్లుగా అభివృద్ధి చేయలేకపోయామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందన్నారు. అంతా అవినీతిమయం అయిందన్నారు. తమకు ఇన్నాళ్లు మాట్లాడే అవకాశం లేదని కౌన్సిలర్లు అన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ కొలమూరి శివాజీ మాట్లాడుతూ మాజీ మంత్రి వేణు తనను ఇబ్బందులకు గురిచేశారని, కేసులు కూడా పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ మంత్రి వేణుపై పలు ఆరోపణలు చేశారు. ముందుగా కౌన్సిలర్లు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంత్రి సుభాష్‌ను చైర్‌పర్సన్ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సత్కరించారు.

జిల్లాలో వర్షపాతం..

అమలాపురంటౌన్, జూన్29: జిల్లాలో సగటున 8 మిల్లీమీటర్ల వర్షపాతం శనివారం నమోదైంది. అత్యధికంగా రామచంద్రపురంలో 35.4 మిల్లీమీటర్లు, ఉప్పలగుప్తంలో అత్యల్పంగా 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం 9, మండపేట 30.4, రాయవరం 3.2, ఆలమూరు 5.2, రావులపాలెం 7.4, కొత్తపేట 6.4, కపిలేశ్వరపురం 3.8, కె.గంగవరం 6.2, ఐ.పోలవరం 5.2, ముమ్మిడివరం 10.2, అయినవిల్లి 5.6, పి.గన్నవరం 3.8, అంబాజీపేట 7.2, మామిడికుదురు 6.4, రాజోలు 4.8, మలికిపురం5, సఖినేటిపల్లి 3.8, అల్లవరం 6.8, అమలాపురం 5.2, కాట్రేనికోన మండలంలో 2.8 మిల్లీమీటర్లు నమోదైంది.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట

స్వామిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

ఎమ్మెల్యే వేగుళ్ల, ఇతర ప్రముఖులు

ఒకరోజు ఆదాయం రూ.36.26 లక్షలు

- 7లో

జగన్ కళ్లల్లో ఆనందం కోసం..

నిర్వాసితులను ముంచేశారు..!

పునరావాసం ఇవ్వకుండా నిర్వాసితులను తరిమేసిన వైనం

జగన్‌తో శభాష్ అనిపించుకోవడమే లక్ష్యంగా ఆ అధికారి పని

నేటికీ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆయనదే పెత్తనం

(రంపచోడవరం): కేవలం జగన్ కళ్లలో ఆనందం కోసం పని చేసిన అధికారులలో ఆయన ఒకరు. జగన్ వద్ద తన ఉనికి కోసం పోలవరం ప్రాజెక్టు పునరావాస వ్యవస్థను వినియోగించుకుని ఏకంగా జగన్ మన్ననలు పొంది నిర్వాసితులను ముంచేసిన వైనమిది. సదరు అధికారిని పిఠాపురం రిటర్నింగ్ అధికారిగా నియమిస్తే ఈయన పనితనాన్ని ముందే గుర్తించిన జనసేన నాయకులు చేసిన ఫిర్యాదుతో ఎన్నికల సంఘం ఆయన్ను వేరే జిల్లాకు పంపేసిన ఉదంతం తెలిసిందే! సదరు అధికారి పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన ప్రజల త్యాగాన్ని, పునరావాసాన్ని విస్మరించి, పరిహారం ఇవ్వకుండానే భూములను లాగేసుకుని, గ్రామాలను ఖాళీ చేయించడాన్నే ప్రగతిగా చాటుకుని నిర్వాసితుల ఆవేదనకు కారణమయ్యారు. పోలవరం ప్రధాన కాలువల పనులను మాత్రమే చేయగలిన కాంగ్రెస్ ప్రభుత్వం తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం సహకారంతో జాతీయ ప్రాజెక్టుగా పోలవరం పనులను పరుగులు పెట్టించి 2019 ఎన్నికలు వచ్చేనాటికి 67 శాతం ప్రగతి సాధించిన సంగతి తెలిసిందే! అంతవరకూ పోలవరంపై పలు విమర్శలు చేసిన వైసీపీ, జగన్‌ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక కేవలం రివర్స్ టెండరింగ్ తప్ప పురోగతిని గాలికి వదిలేసి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయారు. చంద్రబాబు ప్రభుత్వం సాధించిన ప్రగతిని మించి ప్రగతిని సాధించలేకపోయారు. రాజ్యసభకు 2019 నాటికి ఇచ్చిన సమాచారం ప్రకారం అప్పటికి ప్రాజెక్టు ప్రగతి 67.09 శాతం కాగా తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ డ్యాష్‌బోర్డు సమాచారం ప్రకారం నేడు అది 73.59 శాతంగా ఉంది. అంటే ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 6.5 శాతం ప్రగతినే సాధించింది. నిర్వాసితుల పునరావాసాన్ని చూస్తే 56,495 నిర్వాసిత కుటుంబాలకు గానూ 12,797 నిర్వాసిత కుటుంబాలకు మాత్రమే పునరావాసాన్ని అమలు చేశారు. 371 ఆవాసాలకు గానూ 100 లోపు ఆవాసాలను మాత్రమే తరలించగలిగారు. అదీ కూడా పునరావాసాన్ని పూర్తి చేయకుండా తరలించినవే అధికం. నిర్మించాల్సిన 193 పునరావాస కాలనీలలో కనీసం సగం కాలనీలను కూడా పూర్తి చేయలేదు. మొత్తంగా చూస్తే ప్రాజెక్టులో అన్ని అంశాలను కలిపిన ప్రగతి 50 శాతాన్ని కూడా దాటలేదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ తన వెబ్‌సైట్లోనే తేల్చి చెప్పింది. 2019లో వైసీపీ పాలనా పగ్గాలు చేపట్టాక పునరావాసం ఇవ్వకుండానే 59 ఆవాసాలను ఖాళీ చేయించేశారు. 2019 ఎన్నికలకు ముందు పునరావాస ప్యాకేజీని పెంచుతామని, గతంలో తక్కువ పరిహారం పొందిన నిర్వాసితులకు పరిహారాన్ని పెంచుతామని ఇచ్చిన హామీలు ఐదేళ్ల గడిచినా అమలు చేయని దుస్థితి. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా వారి గ్రామాలను ముంచేయడం సరికాదని చంద్రబాబు ప్రభుత్వం భావించి పునరావాసానికే ప్రాధాన్యమిచ్చారు. నిర్మాణ పనులతో పాటు పునరావాస చర్యలనూ ఆయన సమీక్షించేవారు. నిర్వాసితులను దృష్టిలో ఉంచుకుని కాఫర్‌డ్యామ్ పక్క నుంచి గోదావరి జలాలు వెళ్లడానికి ఏ ఆటంకం లేకుండా చంద్రబాబు చూస్తే జగన్ మాత్రం నిర్వాసితులను ముంచే దిశగా కాఫర్‌డ్యామ్‌ను పూర్తి చేసి, దాని ఎత్తును పెంచేసి నిర్వాసితులకు పొమ్మనకుండానే పొగపెట్టారు. ఫలితంగా పరిహారం, పునరావాసం లేకుండానే నిర్వాసితులు గ్రామాలను వదిలి వెళ్లారు. ఇదిలా ఉండగా గత నాలుగేళ్లుగా విలీన మండలాలు ప్రతి ఏటా ఊహించని వరదను ఎదుర్కొన్నాయి.

ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం

పునరావాసాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని కనబర్చి ఎటువంటి వ్యయం లేకుండా నిర్వాసితులను ఖాళీ చేయించామన్న ప్రగతిని చాటుకుని ఇంతకు ముందు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన వివాదాస్పద అధికారి ఒకరు జగన్‌తో శభాష్ అనిపించుకున్నారు. ఈ ట్రాక్ రికార్డుతో పిఠాపురం రిటర్నింగ్ అధికారిగా నియమించబడిన సదరు అధికారిని జనసేన ఫిర్యాదుతో ఎన్నికల సంఘం వేరే జిల్లాకు పంపేసిన సంగతి తెలిసిందే! ఆయన హయాంలోనే ఆయనకు అనుబంధంగా నడిచే భూసేకరణ తదితర అంశాలలో అనేక అక్రమాలు కూడా చోటు చేసుకోగా ఏకంగా స్పెషల్ కలెక్టర్‌తో సహా పలువురు అధికారులు, దళారులు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. అప్పటికే జగన్‌తో భుజం తట్టించుకుని శభాష్ అనిపించుకున్న సదరు అధికారి నిర్వాసితులకు భూమికి బదులుగా భూమిని ఇచ్చేందుకు సిద్ధమైన రైతులపైనే కేసులు పెట్టి పరిహారం సొమ్మును ఎగ్గొట్టి మరోసారి మన్ననలను పొందాలని చూశారు. కాగా వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి రక్షణ పొందారు. బదిలీపై వెళ్లిపోయినా ఆయన ప్రభావమే ఇంకా ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంపై ఉందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ నిర్వాసితుడు ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం కూడా ఈ కార్యాలయానికి సంబంధించిందే! గతంలో తెలుగుదేశానికి చెందిన ఎమ్మెల్యేను నేల మీద కూర్చొబెట్టి అహం ప్రదర్శించిన చరిత్ర కూడా ఈ అధికారిదే కావడం గమనార్హం.

'కగార్ వ్యతిరేక దినం పాటించాలి'

ఎటపాక, జూన్ 29: జూలై 1న ప్రపంచ కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని కోరుతూ మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్) మావోయిస్టు ఆజాద్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో శనివారం ఓ ప్రకటన విడుదలైంది. భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ పిలుపు మేరకు కగార్ వ్యతిరేక దినం పాటిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటీవల 2024, జనవరి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో ప్రజాయుద్ధాన్ని తుదకంటూ నిర్మూలించడానికి భారత కేంద్ర, రాష్ట్రాల దోపిడీ పాలక వర్గాలు ఒక నూతన ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ ఆపరేషన్ సైనిక క్యాంపెయిన్‌లో ఇప్పటివరకు 125 మందికి పైగా విప్లవప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకత్వ పీఎల్‌జీఏ యోధులను హత్య చేసినట్లు తెలిపారు. దేశ ప్రజలపై కగార్ దాడులు ఆపాలని ప్రపంచ దేశాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. కగార్ వ్యతిరేక దినం రోజున డివిజన్ వ్యాప్తంగా ఉన్న పలు విప్లవ సంస్థల శక్తులు, ప్రజాస్వామిక వాదులు, పాత్రికేయులు, రచయితలు, కళాకారులు, ఆదివాసీ సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు వివిధ రూపాల్లో కగార్ సైనిక దాడులను ఖండించాలని లేఖలో పిలుపునిచ్చారు.

రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

మూడు రోజులు పాటు పర్యటన

1న పింఛన్ల పంపిణీ

2న కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

3న పిఠాపురంలో వారాహి సభ

ఏర్పాట్లపై అధికారుల పరిశీలన


ఏర్పాట్లపై చర్చిస్తున్న నాయకులు, అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 29: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన అధికారికంగా ఖరారయింది. పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికయిన అనంతరం తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి, కాకినాడ జిల్లా పర్యటనకు వస్తున్న జనసేనానికి ఘనస్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తుండగా, పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. జూలై 1వ తేదీన హైదరాబాద్ నుంచి విమానంలో రాజమహేంద్రవరానికి వచ్చే పవన్‌కల్యాణ్ అక్కడ నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మండపానికి చేరుకుంటారు. అక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో జరిగే సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. 2వ తేదీ ఉదయం చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కాకినాడ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకూ పంచాయతీరాజ్‌శాఖ, 11.30 నుంచి 12.30 వరకూ ఇరిగేషన్ శాఖ, 1.30 గంటల వరకూ అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారు. అనంతరం రోడ్డు కనెక్టవిటీ, రహదారుల పరిస్థితిపై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. సమావేశం అనంతరం చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. అక్కడ జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు. 3వ తేదీన చేబ్రోలు నివాసం నుంచి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుని అక్కడ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలిస్తారు. తిరిగి నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో పరిచయ కార్యక్రమం, అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్యనేతల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి సభలో పవన్‌కల్యాణ్ పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు.

ఏర్పాట్లపై పరిశీలన

గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణ మండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులు పరిశీలన జరిపారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై సమీక్షించారు. పరిశీలనలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో కిశోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీఎల్‌డీవో నారాయణమూర్తి, సీఐ శ్రీనివాస్, తహసీల్దారు ఉదయభాస్కర్, ఎస్ఐ జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు పాటు జిల్లా బహిష్కరణ

కాకినాడ క్రైం, జూన్ 29: కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన నేరస్తుడు గురజాపు దుర్గాప్రసాద్(మొప్పలోడు)ను కాకినాడ జిల్లా నుంచి ఆరు నెలలపాటు బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్లు కాకినాడ త్రీటౌన్ ఎస్‌హెచ్‌వో ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. కాకినాడ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో దుర్గాప్రసాద్‌పై పలు కేసులు ఉండగా అతడిని అరెస్ట్ చేశామన్నారు. అతడు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, గుండాయిజం, టెర్రర్‌గా ప్రవర్తిస్తూ అవమానిస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిందితుడిపై 2023, మే 12న సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశామన్నారు. కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 కేసులు ఉన్నాయని, 2014, 2017, 2019ల్లో మంచిగా ఉండేందుకు బౌండ్ ఓవర్ కేసులు పెట్టినా, ప్రజాశాంతికి భంగం కలిగిస్తుండడంతో అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అతడ్ని కాకినాడ జిల్లానుంచి బహిష్కరణ కోసం జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేయగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా నుంచి 6 నెలల పాటు బహిష్కరిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. తక్షణమే కాకినాడ జిల్లా విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని నేరస్తుడు గురజాపు దుర్గాప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి జిల్లాలో ఎక్కడైనా సంచరిస్తున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూగుల్‌లో రూ.67 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం


విద్యార్థికి వీసీ అభినందనలు

జేఎన్టీయూకే, జూన్ 29: కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే లో సీఎస్ఈ విభాగంలో ఎంటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న దొండపాటి హేమంత్ కుమార్ గూగుల్‌లో సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా కొలువు సాధించినట్లు యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అత్యధిక ప్యాకేజీ వార్షిక వేతనం రూ.67 లక్షలతో కొలువు సాధించిన హేమంత్‌కుమార్‌ను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బహుళ జాతి సంస్థలతో యూసీఈకే కళాశాల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్న అంశాలు, విధి విధానాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్నారన్నారు. గూగుల్ కంపెనీకి సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా ఎంపికైన హేమంత్‌కుమార్ స్వస్థలం కాకినాడ కాగా అతడి తండ్రి రాజారావు యూపీహెచ్‌సీలో డీఏవోగాను, తల్లి సూర్యకుమారి విశాఖపట్నం ఆర్టీసీలో ఆరోగ్య విద్యలో ఎక్స్‌టెన్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. యూసీఈకే ప్లేస్‌మెంట్ అధికారిణి డాక్టర్ అరవ కరుణ, సీఎస్ఈ విభాగాధిపతి ఓ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తలు వహించాలి

రంపచోడవరం, జూన్29: రంపచోడవరం మండలం భద్రాచలం హైవేను ఆనుకుని ఉన్న సీతపల్లి వాగు విహార కేంద్రానికి వచ్చే పర్యాటకులు వాగులోకి దిగరాదని, వాగు ప్రమాదభరితంగా ఉందని రంపచోడవరం పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ ఈ మేరకు మీడియా ద్వారా పర్యాటకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం కావడంతో పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వైసీపీ నేత ఇంటి వద్ద మరో వైసీపీ నేత నిరసన

గత ప్రభుత్వంలో బెదిరించి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపణ

అనపర్తి, జూన్ 29 : అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వైసీపీ నాయకుడు పడాల హరి సాయికృష్ణారెడ్డి తనకు అన్యాయం చేశాడని ఆర్థిక లావాదేవీలను అడ్డుపెట్టుకుని అప్పటి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై అసత్య అవినీతి ఆరోపణలు చేయించారంటూ అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి హరి సాయికృష్ణారెడ్డి ఇంటి వద్ద టెంటు వేసుకుని నిరసనకు దిగారు. ఇది తెలుసుకున్న పలువురు వలంటీర్లు కూడా తమతో కూడా నల్లమిల్లిపై అనేక పోస్టింగులు పెట్టాలంటూ బెదిరించారంటూ సాయి ఇంటి వద్ద పడాలతో బాటు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంతో తాను అనేక కాంట్రాక్టు వర్కులు చేశానని బిల్లులు రావాల్సి ఉండగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన వద్ద లంచం తీసుకున్నారంటూ వీడియో మాట్లాడాలని సాయి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఒత్తిడి తీసుకురావడంతో ఆయన తన వద్ద రూ.18 లక్షలు లంచం తీసుకున్నారంటూ తప్పుడు వీడియో విడుదల చేశానని అన్నారు. అయితే తన బిల్లులు చెల్లించకుండా అడ్డుకున్న సాయి తనతో ఖాళీ నోట్లు, చెక్కులపై సంతకాలు తీసుకున్నారని అవి వారి వద్ద ఉంచుకున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో నల్లమిల్లి విజయం సాధించడంతో తాను నల్లమిల్లిని కలిసి క్షమించమని కోరానని ఇక్కడ చూస్తే సాయి తన గోడు వినకుండా తప్పించుకు తిరుగుతున్నాడని చేసేది లేక సాయి ఇంటి వద్ద టెంటు వేసుకుని దీక్ష చేపట్టానని చెప్పారు. తనకు రావలసిన సొమ్ములు ఇచ్చే వరకు నిరసన కొనసాగిస్తానని అన్నారు. పడాల చేపట్టిన నిరసన విషయం తెలుసుకున్న పలువురు వలంటీర్లు అక్కడకు చేరుకుని వారు కూడా నిరసనలో పాల్గొన్నారు. పడాల సాయి, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కలిసి తమతో నల్లమిల్లిపై తప్పుడు పోస్టింగులు పెట్టించే వారని లేకుంటే ఉద్యోగాలు ఉండవంటూ బెదిరించే వారని చెప్పారు. ఈ విషయంపై పడాల సాయి, సత్తి ఆదిలక్ష్మిలపై చర్యలు చేపట్టాలని అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాజీ వలంటీర్ కడియాల రేవతి తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట




వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, జూన్ 29: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వేలాది మంది భక్తజనంతో సందడిగా మారింది. గోవింద నామస్మరణలతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి స్వర్ణ శోభితుడైన శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు, తులాభారాలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి చిత్రపటాలు అందజేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.36.26లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ తెలిపారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

ఏఐలో తిరుగులేని శక్తిగా భారత్

ఐటీ నిపుణుడు జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

గండేపల్లి, జూన్ 29: ఏఐలో తిరుగులేని శక్తిగా భారత్ ఎదుగుతోందని ప్రముఖ ఐటీ నిపుణుడు జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి అన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం 'ఆదిత్య ది ఏఐ కింగ్‌'లో జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య ఇండియా స్టార్టప్ ఫౌండేషన్‌ను ఆదిత్య సహకారంతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆదిత్య ప్రొ చాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్‌కు ఆదిత్య యూనివర్సిటీ రూ.కోటి రూపాయలు ఫండ్‌ను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. శేషయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున మరో కోటి రూపాయలు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తమతమ ఆలోచనలకు పదునుపెట్టి సరికొత్త స్టార్టప్‌లతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉద్యోగం పొందిన వారు లాంగ్వేజ్ పరంగా ఇబ్బందులు ఎదుర్కోవడం చూసి ఈ సంవత్సరం నుంచి తమ యూనివర్సిటీలో హిందీ, ఇంగ్లీష్‌తో పాటు జపనీస్ లాంగ్వేజ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేకించి 250మంది విద్యార్థులకు జపనీస్ లాంగ్వేజ్‌లో శిక్షణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఫౌండింగ్ పార్టనర్ 108 కాపిటల్, హైదరాబాద్ ఏంజిల్స్ సీఈవో, పీఎస్ శ్రీకాంత్, ఆదిత్య డిప్యూటీ ప్రొ చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సీఎస్ఈ డేటా సైన్స్ విభాగాధిపతి వరుణ్‌రావ్, ఏఐ విభాగాధిపతి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం


వాకాడ వద్ద రహదారికి అడ్డంగా చెట్లు


వాకాడ బస్ షెల్టర్ వద్ద పడిన చెట్లు

కరప, జూన్ 29: కాకినాడ జిల్లా కరప మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారుజామున గాలివాన బీభత్సానికి పలు చెట్లు విరిగిపడ్డాయి. వాకాడలో కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారికి అడ్డంగా నాలుగు చెట్లు, ఒక విద్యుత్ స్తంభం, కూరాడలో రెండు చెట్లు, ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగాయి. పెద్దాపురప్పాడులో ఒక ట్రాన్స్‌పార్మర్ దెబ్బతిన్నట్టు కరప సబ్‌స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాకాడ, కూరాడ గ్రామాల్లో పడిన చెట్లను తొలగించి, స్తంభాలను నిలబెట్టి మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఏఈ తెలిపారు. భారీవర్షానికి పలు గ్రామాల్లో ఆకుమడులు మునిగిపోయి చల్లిన విత్తనాలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బిక్కవోలు, జూన్ 29: బిక్కవోలులో విద్యుదాఘాతంతో ఊలపల్లి గ్రామానికి చెందిన గొర్త చిన్న (40) అనే హెల్పర్ మృతి చెందాడు. చిన్న గ్రామంలో ఎలక్ట్రికల్ గూడ్స్ షాపు నడుపుకుంటూ లైన్‌మెన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బిక్కవోలులో విద్యుత్ వైర్ల మరమ్మత్తులు చేయడంతో లైన్‌మన్ కూడా పనులు చేయడానికి వచ్చి శనివారం ఉదయం బిక్కవోలు కాటన్‌బొమ్మ సెంటర్‌లో 11కెవి విద్యుత్ వైర్ల రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్లకు విద్యుత్ ప్రవహించి షాక్‌కు గురై అక్కడికక్కడే చిన్న మృతి చెందాడు. చిన్న మృతదేహాన్ని ఏఈ కె.బుజ్జిదొర తోటి సిబ్బందితో కిందికి దించారు. ఊలపల్లికి చెందిన బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరడంతో అనపర్తి ఏడీఏ నిరంజన్ డిపార్టుమెంట్ తరపున రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. చిన్న భార్య సత్యకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

రూ.10కే అమ్మ భోజనం

రాజానగరం, జూన్ 29: జూలై 1 నుంచి రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో రూ.10లకే అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని జూలై 1న కృష్ణాజిల్లా వాస్తవ్యుడు, న్యూయార్క్ నివాసి సుప్రసిద్ధ రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. రూ.10లకే భోజనం రాదని అయితే మిగిలిన డబ్బును జీఎస్ఎల్ గ్రూపు సంస్థలు సబ్సిడీగా సమకూరుస్తాయన్నారు. డాక్టర్ గన్ని సుబ్బలక్ష్మి పేరుతో డాక్టర్ డే రోజైన జూలై 1న రెండు దశాబ్దాల కిందట జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి ఆవిర్భవించిందన్నారు. రోగులకు అందిస్తున్న ఫ్రీ ట్రీట్మెంట్లు, ఫ్రీ ప్రొసీజర్లు, ఫ్రీ సర్జరీల సేవలను మరో నెల రోజులు పాటు పొడిగిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్తలు అవసరం



అవగాహన కల్పిస్తున్న సౌజన్య

బిక్కవోలు, జూన్ 29: విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలు నివారించగలమని రాజమహేంద్రవరం ఉప విద్యుత్ తనిఖీ అధికారి బి.సౌజన్య సూచించారు. బలభద్రపురం గ్రాసిం ఇండస్ట్రీస్‌లో శనివారం ఆమె పారిశ్రామిక విద్యుత్ ప్రమాణాల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 26 నుంచి జూలై 2వరకూ విద్యుత్ భద్రతను స్వీకరించి జీవితాలను రక్షించండి అనే నినాదంతో జాతీయ విద్యుత్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిశ్రమల్లో వివిధ సందర్భాలలో సంభవించే పలు ప్రమాదాలు వివరిస్తూ అవి జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కార్మికులకు వివరించారు. ఈ అవగాహనా సదస్సులను పరిశ్రమలు, పాఠశాలలు, ఆసుపత్రులు, సినిమాహాళ్లు, షాపింగ్ మాల్స్‌లలో నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రాసిం సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2170 కేసుల పరిష్కారం



కక్షిదారుకు అవార్డు అందజేత

రాజమహేంద్రవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ద్వారా శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2170 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజీమార్గం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి తూర్పు పరిధిలోని నాలుగు రెవెన్యూ జిల్లాల్లోని కోర్టుల్లో 45 బెంచ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. మోటారు వాహనాల ప్రమాదాల్లో పరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యం నివారించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి అవార్డు(తీర్పు)లు అందజేసినట్లు చెప్పారు. శనివారం పరిష్కరించిన కేసుల్లో క్రిమినల్ 1516, సివిల్ 504, ప్రీలిటిగేషన్ 150 ఉన్నాయన్నారు. జాతీయ, ప్రత్యేక లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం పొందే వీలు కలుగుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. 5వ అదనపు జిల్లా జడ్జి డి.విజయ్ గౌతమ్, 8వ అదనపు జిల్లా జడ్జి వై.జెన్నయ్య నాయుడు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, ఎస్పీఈ అండ్ ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో పోలీసు అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కొత్త చట్టాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. భారతీయ న్యాయ సంహితపై మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పీపీ(గ్రేడ్-1) జీఎస్‌వీ ప్రసాదరావు, భారతీయ నాగరిక సురక్షా సంహితపై కాకినాడ సబ్ కోర్టు అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ రాజు, భారతీయ సాక్ష్య అధినియంపై మాజీ సీబ్యూసీ చైర్మన్ బి.పద్మావతి అవగాహన కల్పిస్తారన్నారు. అధికారులు, సిబ్బంది సుమారు 300 మంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి





కొత్తపల్లి, జూన్ 29: రక్షిత మంచినీటి పథక ట్యాంకులను శుభ్రం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు గట్టుపై కాలు జారి రిజర్వాయర్లో పడి వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఈ సంఘటన శనివారం జరిగింది. వాకతిప్ప గ్రామంలోని సూరప్ప చెరువులో నాగులాపల్లి ఏరియా సమగ్ర గ్రామీణరక్షిత మంచినీటి పథకంలో నీటిని శుభ్రం చేసే ట్యాంక్‌లో క్లీనింగ్ చేయడానికి వలసపాకలకు చెందిన తంగెళ్ల అప్పన్న(25)తో పాటు 8 మంది వచ్చారు. భోజన విరామ సమయంలో తంగెళ్ల అప్పన్నతో పాటు అతడి స్నేహితుడు సాంబ కలిసి రిజర్వాయర్ చెరువు గట్టుపై నుంచి వస్తుండగా కాలు జారి ఇద్దరూ రిజర్వాయర్లో జారారు. ఇది గమనించిన సహచర కూలీలు సాంబను పైకి లాగారు. అప్పటికే అప్పన్న రిజర్వాయర్లోకి పూర్తిగా మునిగి గల్లంతయ్యాడు. కూలీలు అందరూ ఎంత వెతికినా ఆచూకీ దొరకపోవడంతో గజ ఈతగాళ్ల వలలతో రిజర్వాయర్‌లో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. రక్షిత మంచినీటి పథక నిర్వాహకులు ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం

అయినవిల్లి, జూన్ 29: ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీవో టీఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై జూలై 1 నుంచి 31వరకు జరిగే మాసోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సురక్షితమైన తాగునీరు, ఆహారం తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ బి. మంగాదేవి, ఆర్.భాస్కరరావు, జి.సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం
- నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

నగర పంచాయతీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాం

ముమ్మిడివరం, జూన్ 29: నగర పంచాయతీని రాజకీయాలకు అతీతంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పేర్కొన్నారు. శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలమ్మ చెరువుగట్టు వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మించి ఆహ్లాదకర వాతావరణంలో పార్కు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డు ప్రాజెక్టులో ఉండిపోవడం వల్ల పనులు ప్రారంభం కావడంలేదని, ఆ రోడ్డును ప్రాజెక్టు నుంచి తొలగించి టెండర్లు పిలవాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో నగర పంచాయతీలో రూ.115కోట్లతో మంచినీటి పథకాన్ని తీసుకువస్తే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఆ పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. ఆ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రూ.45కోట్లతో ముమ్మిడివరంలో 133కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడి నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు తీసుకువస్తానన్నారు. చంద్రన్న బీమా పథకంలో ఇంటి యజమానిని కోల్పోతే రూ.10లక్షలు పరిహారం అందిస్తామన్నారు. నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా అంతా కలసి పనిచేయాలన్నారు. నగర



దాట్ల సుబ్బరాజుకు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని బహూకరిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు, చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి

పంచాయతీ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే సుబ్బరాజుకు చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ ముళపర్తి బాలకృష్ణ, కౌన్సిలర్లు, కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. సమావేశంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లుపై ఫ్లోర్ లీడర్ ముళపర్తి బాలకృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నాసిరకం గ్రావెల్‌తో వేసిన రోడ్డుకు బిల్లులు ఎలా పెట్టారని ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ అభ్యంతరం లేవదీయడంతో చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గేదెల్లంకలోని ఆయిల్ ఇండియా సైట్ నుంచి ఉచితంగా గ్రావెల్ తీసుకువచ్చామని, రవాణా చార్జీ, రోలింగ్ చార్జీలు మాత్రమే ఎం బుక్‌లో రికార్డు చేశామని, ఆ ఖర్చుల మొత్తానికి కౌన్సిల్ ముందు ఉంచామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అయితే గతంలో రూ.15లక్షలతో అంచనాలు రూపొందించామని, అప్పుడు తిరస్కరించడంతో మళ్లీ రూ.5.53లక్షలకు తగ్గించారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని బాలకృష్ణ పేర్కొన్నారు. నాసిరకం గ్రావెల్‌తో రోడ్లు ఎలా వేస్తారని ముళపర్తి బాలకృష్ణ ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. కొండాలమ్మ చింత నుంచి బాలయోగీశ్వరుల ఆశ్రమానికి వెళ్లే రహదారిని పునర్నిర్మించాలని, వర్షాకాలంలో డ్రైనేజీలు పూడికలు తొలగించినా కురుస్తున్న వర్షాలకు మళ్లీ ఆ చెత్త డ్రైన్‌లోకి వెళ్లిపోతుందని, ఈపనుల వల్ల లక్షల రూపాయలు ప్రజాధనం వృథా అవుతుందని వైసీపీ కౌన్సిలర్ బొంతు బుజ్జిబాబు ఆరోపించారు. 9వ వార్డు కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముమ్మిడివరం-కాట్రేనికోన రహదారి అధ్వానంగా మారిందని, రూ.24కోట్లతో రహదారి నిర్మాణానికి సొమ్ములు రిలీజైనా పనులు జరగలేదన్నారు. కోటుం జయలక్ష్మి మాట్లాడుతూ తమ వార్డులో ఇబ్బందిగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. 17వ వార్డు కౌన్సిలర్ బొంతు బుజ్జిబాబు మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త సేకరణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కేవలం పట్టణంలో మాత్రమే పారిశుధ్య పనులు చేపడుతున్నారని, మిగిలిన చోటెక్కడా పనులు జరగడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్లు వేడుకూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మామిడికుదురు, జూన్ 29: జూలై నెల పింఛన్ లబ్ధిదారులకు సోమవారం నుంచి ఇంటి వద్దే అందిస్తామని ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి తెలిపారు. పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. దీనికి సచివాలయ సిబ్బంది 203మందిని నియమించామని, మండలంలో 10,144మంది లబ్ధిదారులకు రూ.6.65కోట్లు అందించనున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బందికి సహాయకులుగా వీవోఏలను నియమించామన్నారు.

మలికిపురం: మండలంలో 10,729మంది లబ్ధిదారులకు రూ.7.19కోట్ల పింఛన్లు ఇంటికి వెళ్లి అందజేయాలని అమలాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బి.వీరాస్వామి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీకి మండలంలో 177మందిని నియమించామన్నారు. సమావేశంలో ఎంపీడీవో బి.మంగాదేవి, పరిపాలనాధికారి జి.మిల్టన్, పద్మరాజు, ప్రవీణ పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి ఎంపీడీవో బీవీ సత్యనారాయణ అధ్యక్షతన పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అమలాపురం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి వీరాస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్‌అసిస్టెంట్లు, ఇతర సచివాలయ సిబ్బందికి, పింఛన్లు పంపిణీచేసే అదనపు సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పంచాయతీల పరిధిలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీపై దండోరా వేయించినట్టు తెలిపారు.

ఆలమూరు: మండలంలో జూలై పింఛన్ ఎన్టీఆర్ భరోసా పేరుతో 11,172మందికి రూ.7,44,74,500 పంపిణీకి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో మేరీరోజ్ తెలిపారు. గత నెలలో 11,198 మందికి రూ.3,29,20,000 పంపిణీ చేశామన్నారు. సోమవారం ఉదయం నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తామన్నారు.

బడి ఈడు పిల్లలను నూరు శాతం బడిలో చేర్పిస్తాం

ఆలమూరు, జూన్ 29: నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న బడి ఈడు పిల్లలను నూరు శాతం బడిలో చేర్పిస్తున్నామని సమగ్ర సర్వ శిక్షా ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు తెలిపారు. జొన్నాడలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఇటుక బట్టీల వద్ద సర్వే నిర్వహించారు. జిల్లాలోని 22మండలాల్లోని సర్వ శిక్షా సిబ్బందికి పిల్లలను గుర్తించే విధానంపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. బడి ఈడు విద్యార్థులు ఒక్కరూ కూడా బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో ఇద్దరు విద్యార్థులను గుర్తించి ఒకరిని రావులపాలెం, మరొకరిని సఖినేటిపల్లిలో బడిలో చేర్పించామన్నారు. సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జొన్నాడలో జరిగిన కార్యక్రమంలో జొన్నాడ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.అనంతశ్రీనివాస్, ఉపాధ్యాయులు సలాది శ్రీనవాస్, చింతా శ్రీనివాసరెడ్డి, సీఆర్‌పీటీ గంటి శ్రీను, పీటీఐ దారపురెడ్డి సత్య తదితరులు పాల్గొన్నారు.



ఇటుక బట్టీల వద్ద సర్వే చేస్తున్న దృశ్యం

జాతీయ లోక్‌అదాలత్‌లో 168కేసుల పరిష్కారం



అమలాపురం: జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్

అమలాపురం టౌన్, జూన్ 29: అమలాపురం కోర్టు ఆవరణలో రెండో అదనపు జిల్లా జడ్జి, సివిల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో శనివారం నేషనల్ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో 168కేసులు పరిష్కరించారు. వాటిలో సివిల్ కేసులు 26, క్రిమినల్ కేసులు 68, మోటారు యాక్సిడెంట్ కేసులు 38, బీఎస్ఎన్ఎల్ కేసులు 28, బ్యాంకు కేసులు 8 పరిష్కరించారు. రూ.3కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు చైర్మన్ నరేష్ తెలిపారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, జూనియర్ సివిల్ జడ్జి ఎ.హిమబిందు, లోక్‌అదాలత్ సభ్యులు, మాకిరెడ్డి ఆదినారాయణ, వెంపరాల భాస్కరశాస్త్రి, ఆరుమిల్లి వాణిపాల్గొన్నారు.

64కేసుల పరిష్కారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 64 కేసులు పరిష్కరించినట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహతుల్లా పేర్కొన్నారు. ఈలోక్‌అదాలత్‌లో ఈపీ కేసులు రెండు, ఓఎస్ 2, టైటిల్ కేసులు 3, ఓఎస్ మనీ కేసులు 8, ఎన్‌సీ కేసులు 3, ఎన్ఐ యాక్టు కేసులు 5, ఐపీసీ సీసీ కేసులు 35, ఎస్పీఐ కేసులు ఎనిమిది పరిష్కరించామని, దీనికి సంబంధించి రూ.72,45,352 అపరాధ రుసుం వసూలు చేసినట్టు జూనియర్ సివిల్ జడ్జి తెలిపారు. ఈఅదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, కార్యదర్శి రామాయణం మసేశ్వరరావు, న్యాయవాదులు బీర ప్రసాదరావు, కేఆర్కే రాజు, జి.ఈశ్వరరావు, కేఎల్వీ ప్రసాదరావు, గుత్తుల శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, కాశి సిద్ధార్థకుమార్, ఎం.అలీహసన్, పోలిశెట్టి రాజేష్‌కుమార్, సీఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ బి.సురేష్‌బాబు, ముమ్మిడివరం, కాట్రేనికోన, కేశనకుర్రు బ్యాంకు మేనేజర్లు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 90 కేసుల పరిష్కారం

రామచంద్రపురం: రామచంద్రపురం కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్‌అదాలత్‌లో రూ.2.36 కోట్ల విలువైన 90కేసులు పరిష్కారమైనట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 21సివిల్‌కేసులు, 56క్రిమినల్ కేసులు, 6 బి.ఎస్.ఎన్.ఎల్ పిటీషన్లు పరిష్కరించామన్నారు. లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి, ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు, బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, లోక్‌అదాలత్ సభ్యులు పి.వి.ఎస్. జానకి, ఎస్.బి.ఎస్.కె.కుమారస్వామి, చింతపల్లి శ్రీనివాసు, న్యాయవాదులు, కక్షిదారులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

69కేసుల పరిష్కారం

కొత్తపేట: శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో రెండు బెంచీలు నిర్వహించగా 69కేసులు పరిష్కారమైనట్టు సీనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ పి.రమణారెడ్డి తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో సీసీఐపీసీ 4, మనీ వాయిదాలు 2, మెయింటెన్స్ 2, ఎన్ఐ యాక్టు 1, ఈపీలు 1, బ్యాంకు 3, బీఎస్ఎన్ఎల్ 20 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకర్‌రావు, లోక్ అదాలత్ సభ్యులు అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ మెకానిక్ మృతి

మలికిపురం, జూన్ 29: మలికిపురంలో సుదీర్ఘకాలం మెటారుసైకిల్ మెకానిక్‌గా పనిచేసిన వలవల రాంబాబు(44) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మలికిపురం చాంబర్ ఆఫ్ కామర్స్, మెకానిక్ అసోసియేషన్ సంతాపం తెలిపింది.

పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచాలి

కొత్తపేట, జూన్ 29: ఈ విద్యా సంవత్సరంలో జరిగే పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఈవో ఎం.కమలకుమారి కోరారు. శుక్రవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే నేను బడికి పోతా ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. మందపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఉద్యోగవిరమణ పురస్కరించుకుని మోడేకుర్రు హెచ్ఎం ఎంవీవీ సత్యనారాయణను సన్మానించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మామిడికుదురు, జూన్ 29: జిల్లాలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని అడిషనల్ డీఎంహెచ్‌వో సీహెచ్‌వీ భరతలక్ష్మి పేర్కొన్నారు. మామిడికుదురులో ఆమె శనివారం పర్యటించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న ఫీవర్‌సర్వే, పారిశుధ్య పనులను పరిశీలించారు. మామిడికుదురులో రెండు మలేరియా అనుమానిత కేసులు నమోదయ్యాయని, వారు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మూడు బృందాలు ఏర్పాటుచేసి ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్, సీహెచ్‌వో సత్యవతి, ఎంపీహెచ్ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడు పల్లను కలిసిన ఎంపీపీ కేతా

రాజోలు, జూన్ 29: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్ల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయగా కార్యక్రమంలో పల్లను ఎంపీపీ కేతా శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్ల టీడీపీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలన్నారు.

ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి

కొత్తపేట, జూన్ 29: ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అన్నిచోట్లా ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు.

కొత్తపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నంబూరి రెడ్డియ్య ఆధ్వర్యంలో జరుగుతున్న కైలాశభూమి నిర్మాణానికి కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి రాజ్‌కుమార్ వడయార్ శనివారం రూ.58వేల విరాళాన్ని అందజేశారు.

వాటర్‌వర్క్సులో కొబ్బరి చెట్లు మాయంపై సభ్యుల ధ్వజం

మండపేట, జూన్ 29: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరయ్యారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వాటర్ వర్క్సులో ఉన్న కొబ్బరి చెట్లకు వేలం పాట, గతంలోకి ఇప్పటికి కొబ్బరి చెట్ల సంఖ్యలో తేడా రావడంతో సభ్యులు నిలదీశారు. దీనిపై కొద్దిసేపు చర్చ జరిగింది. గతంలో 366కొబ్బరి చెట్లు ఉన్నట్టు రికార్డులో చూపించిన అధికారులు, ఇప్పుడు 208కొబ్బరి చెట్లు మాత్రమే ఉన్నట్టుగా అజెండాలో చూపించడంతో ఈఅంశంపై రెవెన్యూ అధికారులను సభ్యులు నిలదీశారు. దీనిపై ఆర్ఐ మాట్లాడుతూ గతం నుంచి 208కొబ్బరి చెట్లు మాత్రమే ఉన్నాయన్నారు. కొబ్బరి చెట్లు, ఇతర ఫల వృక్షాలపై వస్తున్న ఆదాయం ఎంతనే విషయంపై సభ్యులు నిలదీశారు 2021లో రూ.1.9లక్షలు వేలం ద్వారా వచ్చిందన్నారు. అయితే వేలం పాట ముసుగులో పెద్దలు కొబ్బరి, ఇతర ఫల సాయం కాజేశారన్న ఆరోపణలు వచ్చాయని, ఈఅంశంపై వివరణ ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ల నిలదీశారు. ప్రభుత్వం ఆదాయానికి గండి పడితే ఎలా అంటూ ఆయన అధికారులపై మండిపడ్డారు. దీనిపై రెవెన్యూ అధికారులు వివరణ ఇచ్చారు. పట్టణంలో దుకాణాలకు మూడు నెలల నుంచి అద్దె బకాయిలు ఉన్నాయని, నోటీసులిచ్చి అద్దెలు వసూలు చేయాలని సభ్యులు సూచించారు. సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పారు. గొల్లపుంతకాలనీలోని మున్సిపల్ దుకాణ సముదాయంలోని రెండు దుకాణాలు కొంతకాలం నుంచి అద్దెలు లేకుండా కొంతమంది వ్యక్తులు వినియోగించుకుంటున్న అంశంపై వేగుళ్ల అధికారులను నిలదీశారు. కొంత కాలం నుంచి రెండు దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయని, ఒక దుకాణానికి మాత్రమే అద్దె వస్తుందని ఆర్ఐ చెప్పారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వేగుళ్ల కోరారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే పనులు చేయవద్దన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారాయ్యబాబు, కౌన్సిలర్లు కాళ్లకూరి స్వరాజ్యభవాని, శిరంగు జ్యోతి, చింతలపూడి దుర్గ, కాశీన కాశి విశ్వనాథం, చుండ్రు సుబ్బారావు, చౌదరి, యరమాటి గంగరాజు, కమిషనర్ బి.రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత తొలిసారిగా మున్సిపల్ సమావేశానికి వచ్చిన వేగుళ్ల జోగేశ్వరరావును కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, పాలకవర్గ సభ్యులు, కమిషనర్ బి.రాము, వివిధ శాఖల అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కౌన్సిల్‌లో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ రాణి

జాతీయ పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ డే

అమలాపురం రూరల్ , జూన్ 29: అమలాపురం కిమ్స్ దంత వైద్య కళాశాలలో జాతీయ పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ వారోత్సవాలను నిర్వహించారు. శనివారం ముగింపును పురస్కరించుకుని వైద్య కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ ఆర్‌సీ జగత్‌రెడ్డి దంత వైద్య వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారాలు తదితర అంశాల గురించి వివరించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీకే రాజు, న్యాయవాది శ్రీనివాసరావు నోటి ఆరోగ్యం గురించి వివరించారు. వారోత్సవాల్లో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. స్మైల్ కాంటెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్‌వర్మ, జేఎండీ కేఎస్ పవిత్ర, డైరెక్టర్ శ్యామల, ఉపాధ్యక్షుడుమోహన్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శివకుమార్ పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న టీడీపీ యువత

కె.గంగవరం, జూన్ 29: టీడీపీ అధికారంలోకి రావాలని కుందూరు టీడీపీ యువత వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. శనివారం ఆ మొక్కును చెల్లించుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరయ్యారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పార్టీ నాయకులు జగతా రమణ, పామర్తి బాబి, రెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయండి

అంబాజీపేట, జూన్29: సమగ్ర శిక్షాలో పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా పనిచేస్తోన్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్, పీఈటీలు శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు. కనీస వేతనం రూ.33,000 అందించాలని కోరారు.

దళితుల పథకాలను పునరుద్ధరించడం హర్షణీయం

అమలాపురం టౌన్, జూన్ 29: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని ప్రకటించడం హర్షణీయమని దళిత ప్రజా సంఘాల, మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. అయితే ఎస్సీ వర్గీకరణ చట్ట బద్ధం కాదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాలమహానాడు నాయకుల సమావేశం డీబీ లోక్ అధ్యక్షతన జరిగింది. ఎస్సీ వర్గీకరణ చెల్లదని చట్టం చెబుతుండడంతో పాటు ఎన్నో రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీనియర్ నాయకుడు జంగా బాబూరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంలో దళితులంతా ఐక్యంగా ఉండాలని కోరుకున్నారన్నారు. పెరిగిన జనాభాను బట్టి ఎస్సీల రిజర్వేషన్లు పెంచాలి తప్ప వర్గీకరణ చేయడం తగదని లోక్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఇసుకపట్ల రఘుబాబు పేర్కొన్నారు. జగనన్న విదేశీ విద్యా పథకం పేరును గతంలో మాదిరిగా అంబేడ్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యగా మార్చడం ద్వారా దళితుల మనోభావాలను గౌరవించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాలమాదిగల జనాభా లెక్కలు తేల్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని, అది రాష్ట్రంలో ముగిసిన ఘట్టమని గొల్లపల్లి డేవిడ్‌రాజు పేర్కొన్నారు. మాలమహానాడు నాయకులు పండు అశోక్‌కుమార్, కోట రామ్మోహనరావు, గెడ్డం సురేష్‌బాబు, పెయ్యల పరశురాముడు, అయితాబత్తుల సుభాషిణి, రేవు తిరుపతిరావు, రెడ్డి నాగేశ్వరరావు, నక్కా సంపత్, గూటం సాయి, సిద్దు పాల్గొన్నారు.

అమలాపురం ఎంపీడీవోగా మల్లికార్జునరావు



అమలాపురం రూరల్, జూన్ 29: అమలాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.మల్లికార్జునరావు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అమలాపురం ఎంపీడీవోగా పనిచేస్తున్న జొన్నాడ వెంకటేశ్వరరావు నెలాఖరుతో పదవీ విరమణ చేయనున్నారు. దాంతో అమలాపురం ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న మల్లికార్జునరావుకు ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,101 విరాళం

అయినవిల్లి, జూన్ 29: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి అన్నప్రసాద ట్రస్టుకు తెనాలి పెదరావూరుకు చెందిన దవులూరి బ్రహ్మలక్ష్మి కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 29: రామచంద్రపురం పట్టణంలో శ్మశానవాటికల అభివృద్ధికి మంత్రి సుభాష్ చర్యలు ప్రారంభించారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశం అనంతరం బస్సు కాంప్లెక్సు వద్ద గల శ్మశానవాటికను మంత్రి పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఇతర నాయకులతో శ్మశానవాటిక అభివృద్ధిపై చర్చించారు. శ్మశానవాటిక అభివృద్ధికి అంచనాలు తయారు చేయాలని సూచించారు. లారీయూనియన్ కార్యాలయం వద్ద ఉన్న శ్మశానవాటికను పరిశీలించారు. గతంలో మాజీమంత్రి హయాంలో శ్మశానవాటికను ఆక్రమించి చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, టీడీపీ నాయకులు గుణ్ణం వినోద్‌కుమార్, నండూరి ఫణికుమార్, రవ్వాభూషణం, జనసేన కౌన్సిలరు అంకం శ్రీనివాస్, జనసేన నాయకుడు బుంగరాజు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకులను నిరంతర పర్యవేక్షణ చేయాలి

పి.గన్నవరం, జూన్ 29: గ్రామాల్లో వాటర్‌ట్యాంకులపై గ్రామస్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా పంచాయితీ అధికారి డి.రాంబాబు సూచించారు. బెల్లంపూడి గ్రామంలో సర్పంచ్ బండి మహాలక్ష్మితో వాటర్‌ట్యాంకులను, పరిసరాలను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. వాటర్‌ట్యాంకు పరిసరాల్లో చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. నిరంతరం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతి కార్యదర్శి గ్రామాల్లో విధిగా బ్లీచింగ్‌ను చల్లించడంతో పాటు దోమల మందును పిచికారి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి ఫీవర్‌సర్వేను అడిగి తెలుసుకున్నారు. డీపీవో వెంట ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరావు, సీసీ సత్యనారాయణ, కార్యదర్శి రాణి ఉన్నారు.

డీజీపీని కలిసిన టీడీపీ నేతలు



అంబాజీపేట, జూన్ 29: డీజీపీ ద్వారకా తిరుమలరావును నియోజకవర్గానికి చెందిన నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ అబ్జర్వర్ షేక్ సుభాన్, టీడీపీ నాయకుడు యర్రా శ్రీనివాసరావు డీజీపీకి పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. ఎస్‌కే మీరా తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే హామీల అమలుకు ఉద్యమించాలి

అమలాపురం రూరల్, జూన్ 29: కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమించాలని ఆ పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తీర్మానించారు. బండారులంకలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం కామన ప్రభాకరరావు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నాయకులతో వేర్వేరుగా రాష్ట్ర నాయకులు జంగా గౌతమ్, కొత్తూరి శ్రీనివాస్‌లు సమీక్షించారు. సమావేశంలో సరెళ్ల ప్రసన్నకుమార్, అయితాబత్తుల సుభాషిణి, పాలెపు ధర్మారావు, రౌతు ఈశ్వరరావు, కోట శ్రీనివాసరావుతో పాటు వడ్డి నాగేశ్వరరావు, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్, మాచవరపు శివన్నారాయణ, షకీలా పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



అంతర్వేది, జూన్ 29: మోరి జడ్పీ హైస్కూల్‌లో మహిళా కళాశాల ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు టీడీపీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఈహైస్కూలులో విశాలమైన 21 తరగతి గదులు, రెండు ఎకరాల ఆటస్థలం, ప్రస్తుతం పాఠశాల ఉన్న స్థలమే కాకుండా దక్షిణ భాగాన ప్రహరీతో కూడిన 80సెంట్ల స్థలంలో కళాశాల కార్యాలయానికి సిద్ధంగా ఉందన్నారు.

శనేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, జూన్ 29: మండలంలోని మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. స్వామివారి సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,00,969 ఒకరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, జూన్ 29: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీనారాయణ, నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని 2,685మంది భక్తులు దర్శించుకున్నారని, 1962మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,82,249 ఆదాయం వచ్చిందని ఈవో జి.మాధవి తెలిపారు. అప్పనపల్లి బాలబాలాజీస్వామిని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏసీ జి.మాధవి ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బొంతు సూర్యభాస్కరరావు, గుబ్బల సింహాద్రి, కంకిపాటి సుబ్బారావు, కోలా రాంబాబు, కాకి వాసు, కంకిపాటి నరసింహారావు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు 1.45లక్షలు విరాళం

ఆత్రేయపురం, జూన్ 29: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు బెంగళూరుకు చెందిన మిరియాల దత్తసాయినాథ్-సత్యశ్రావణి దంపతులు రూ.1,45,500 విరాళం సమర్పించారు. ఈవో కృష్ణచైతన్య స్వామివారి చిత్రపటం దాతలకు అందజేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.24వేలు విరాళం

ఐ.పోలవరం, జూన్ 29: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు శనివారం విజయవాడకు చెందిన పులి విజయనరసింహం రూ.24,666 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బొల్లం వీరభద్రరావుకు అందించారు. దాతను స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి యనమల కుటుంబ సభ్యులు వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి చిత్రపటం బహూకరించి ఆలయ అర్చకులు వారిని సత్కరించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు మాకూ వర్తింపచెయ్యండి

ఉప్పలగుప్తం, జూన్ 29: సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యోగులకు ఒక నెల జీతం అదనంగా ఇవ్వాలన్న ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తమకూ వర్తింప చెయ్యాలంటూ గ్రామసచివాలయాల ఉద్యోగులు శనివారం తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం సమర్పించారు. నాలుగేళ్ల నుంచి తాము ఎన్నికల విధుల్లో ఉన్నామన్నారు. బీఎల్‌వోలుగా సొంత సొమ్ముతో స్టేషనరీ కొనుగోలు చేసి విధులు నిర్వర్తించామన్నారు. ఆర్డీవో, ఇతర ఉన్నతాధికారుల కార్యాలయాలకు సొంత సొమ్ముతో రాకపోకలు సాగించామన్నారు. శని, ఆదివారాల్లో సైతం ఎన్నోవత్తిళ్ళకు తలొగ్గి పనిచేస్తే నాలుగేళ్లకు రూ.4వేలు ఇచ్చారని ఆవేదనవ్యక్తంచేశారు. కె.బాలకృష్ణ ఆధ్వర్యంలోవినతిపత్రం ఇచ్చారు.

ఉద్యోగవిరమణ చేసిన ఉపాధ్యాయులకు సన్మానం

కె.గంగవరం, జూన్ 29: సత్యవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాదే సత్యవతి, మల్లవరం పాఠశాల ఉపాధ్యాయురాలు భాగవతుల లక్ష్మీనరసమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయా పాఠశాలల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కె.గంగవరం శాఖ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్ కుమార్, పి. గుణవంతుడు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వాడపల్లి అనంత దీక్షితులు ఉద్యోగ విరమణ సందర్భంగా దీక్షితులు దంపతులను శనివారం ఉపాధ్యాయులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. హెచ్ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు ఉదయభాస్కర్, బాలకృష్ణ, జనార్ధనశాస్త్రి, సత్యనారాయణ, బాబాయ్‌లతో పాటు విద్యార్థులుపాల్గొన్నారు.

రాయవరం: విధి నిర్వహణలో అందించిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ అన్నారు. శనివారం మాచవరం నెంబర్-1 పాఠశాలలో పీఎస్ హెచ్ఎం యాకల రామకృష్ణారావు(శ్రీను) ఉద్యోగవిరమణ సందర్భంగా ఆయనను శనివారం ఉపాధ్యాయులుసత్కరించారు. ఉపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, ఎ.కృష్ణమోహన్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి కంచాలు బహూకరణ

ఉప్పలగుప్తం, జూన్ 29: భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్‌లో పీఎం పోషణ మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులకు రెడ్డిపల్లికి చెందిన కరాటం జగదీష్‌నాయుడు 150స్టీల్ కంచాలు బహూకరించారు. దాతను స్థానిక ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి అభినందించారు. ఎంపీటీసీ నాగరత్నకుమారితో పాటు హెచ్ఎం నూకల సత్యనారాయణ, నేషనల్ అవార్డు గ్రహీత కరాటం ప్రవీణ్, రాయి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్ఏ కార్యాలయం సూపరింటెండెంట్‌గా కాళ్ల

యానాం, జూన్ 29: యానాం పరిపాలనాధికారి కార్యాలయం (ఆర్ఏ) నూతన సూపరింటెండెంట్‌గా పుదుచ్చేరి పోలీస్‌శాఖలో పనిచేస్తోన్న కె.వి.వి.సత్యనారాయణ(కాళ్ల) నియమితులయ్యారు. పుదుచ్చేరిప్రభుత్వం ఉద్యోగులను బదిలీలు చేసింది. జైల్‌శాఖలో పనిచేస్తోన్న కొత్త సత్యసూర్యనారాయణ(బాబీ)ను యానాం విద్యుత్ శాఖకు, పుదుచ్చేరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తోన్న పొలిమారి శ్రీనివాస్‌ను పుదుచ్చేరి సమాచార శాఖకు బదిలీచేశారు. యానాం ఆసుపత్రిలో అసిస్టెంట్‌గా పనిచేస్తోన్న అనివిల్లి శ్రీనివాస్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి సెదరపేటలోని హైయ్యర్ సెకండరీ పాఠశాలకు నియమించారు.